కూడా వినపడుతున్నై. వంటింట్లో అత్తగారేవో చేస్తున్నది అల్లుడి ఫలహారార్థం. మధ్య నడవలో శకుంతల ఏదో పాడుతున్నది.

రంగనాథరావు మెల్లిగా లేచి తను పడుకున్న గది తలుపు సందుల్లోనించి చూశాడు. శకుంతల చాపమీద సగం కూర్చుని సగం పడుకుని ఏదో రాసు కుంటున్నది.

అతనట్లా చూస్తుండగానే వంటింట్లో నించి ఆమె తల్లి "ఏమిటే, అమ్మాయి! ఆ రాగాలూ! నీ మొగుడక్కడే పడుకుంటేనూ!" అంది.

శకుంతల తలయినా ఎత్తకుండానే "బావ పడుకుని నిద్దరపోతున్నాడు లేవే! ఒకటే గోలా!" అంది.

రంగనాథరావు మనసు పొంగిపోయింది. ఇదీ తన శకుంతల! ఏదో పొరపాటు జరిగింది! అతను మెల్లగా తలుపు తెరిచాడు. సగం పడుకున్న శకుంతల నిటారుగా లేచి నిల్చుని పుస్తకం అక్కడే వదిలిపెట్టి పారిపొయ్యే ప్రయత్నంలో ఉంది.

"మాటే శకుంతలా!" అన్నాడు బావ.

ఒకసారి వంటింటివైపు చూసి శకుంతల వచ్చింది.

"ఏమిటి నీకీ దుర్బుద్ధి? నన్ను చూసి ఎందుకట్లా పారిపోతున్నావు? ఇందుకా నిన్ను ఏరికోరి చేసుకుంది?"

"నన్నా రోజున– జయలక్ష్మి పెళ్ళిలో– ఎంత ఎగతాళి పట్టించి ఏడిపించారో తెలుసా? ఇప్పుడూ మా అమ్మ చూడరాదూ?"

"అన్నట్టు అత్తయ్య ఏమిటో చేస్తున్నదే?"

"బజ్జీలు."

"అయితే, నా క్కావాలని కాసిని పట్టుకొస్తావా?"

"ఆ."

"ఉండు! ఏమని అడుగుతా మీ అమ్మను?"

"బావకు ఆకలవుతున్నదిట! 'కాసిని బజ్జీలు పెట్టవమ్మా' అని అడుగు తాను!" అంటూ శకుంతల పరిగెత్తింది.

ఒక చల్లని గాలిపొర వీచింది. భోరున తొలకరి వర్షం ప్రారంభమైంది.

కాలం ఒక తీరుగా ఉండదు. ప్రతి కథా ఎప్పుడో ఒకప్పుడు కంచికి వెళ్ళి తీరాలిసిందే! జీవితం మాస పత్రికల నలంకరించే స్థానంనించి దిగి రావాలిసిందే!........

ఇప్పుడు శకుంతల మొగుడిమీద ఎంతో కోపం వస్తే "ఏమిటి బావా!" అంటుంది. తప్పలేకపోతే అందరు పెళ్ళాలల్లే "ఏమండీ" అనే పిలుస్తుంది!

(ప్రథమ ముద్రణ : మే 1935, వినోదిని)